నమస్తే తెలంగాణ
నిర్మల్
3 | నిజామాబాద్, గురువారం 21 మార్చి 2024 | NIRMAL

సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ముఖ్య నాయకులు

విజయమే లక్ష్యం

- ఆ దిశగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతాం..
- బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య నేతలతో సమావేశం

ఎదులాపురం, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. పట్టణంలో బుధవారం ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రణాళికలు, ప్రచార వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ.. తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపేలా కేసీఆర్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని గుర్తు చేశారు. ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, పార్టీ ముఖ్య నాయకులు జాన్సన్ నాయక్, రాంకిషన్‌రెడ్డి, లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్, పటేల్‌లు పాల్గొన్నారు.

సర్కారుపై గుస్సా

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆగ్రహం

- సీపీఎస్ రద్దుపై స్పందన కరువు
- భాషా పండితుల పదోన్నతులపై అసంతృప్తి
- బదిలీలు, పదోన్నతులపై నాన్చివేత ధోరణి
- 317 జీవోపై ఆలస్యమవుతున్న ఉపసంఘం చర్చలు

నిర్మల్, మార్చి 20(నమస్తే తెలంగాణ) : తాము అధికారంలోకి రాగానే ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామంటూ కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు బుట్టదాఖలు అవుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఉద్యోగులు, ఉపాధ్యాయుల వ్యవహారంలో ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు ఓటేసి గెలిపిస్తే కంటికి రెప్పలా చూసుకోవడమే కాకుండా, ఊహించని నజరానాలను ప్రకటిస్తామంటూ ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అధికారం చేపట్టగానే ఆ హామీలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. కేవలం సమావేశాలు, సమీక్షలకే పరిమితం చేస్తూ కాలయాపన చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 317 జీవో విషయంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించినప్పటికీ, ఇప్పటివరకు దిశా నిర్దేశం కనిపించడం లేదంటున్నారు. కేవలం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్యలు జరిపినప్పటికీ, ఆ చర్చలపై స్పష్టమైన క్లారిటీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తామంతా సొంత జిల్లాలకు వస్తామని ఆశించిన 317 ఉద్యోగులు ప్రస్తుతం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీంతోపాటు డీఏ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు హామీల వర్షం కురిపించింది. ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైన సీఎం డీఏలు ప్రకటిస్తారని ఆశగా ఎదురు చూశారు. అధికారం చేపట్టగానే రేవంత్‌రెడ్డి తానిచ్చిన హామీలన్నీ విస్మరిస్తున్నారన్న ప్రచారం జరుగుతున్నది. ఇదిలాఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కాంట్రిబ్యూటరీ పెన్షన్(సీపీఎస్) పథకాన్ని రద్దు చేసి, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పటివరకు సీపీఎస్‌పై కూడా నిర్ణయం తీసుకోకపోవడం, అలాగే సీపీఎస్ సంఘాలతో చర్చించకపోవడం వంటివి నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొంటున్నారు. అలాగే ఉద్యోగులు, ఎస్జీటీ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపై క్లారిటీ రాలేదు. జూన్ 4 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్నందున, అప్పటివరకు ఈ ప్రక్రియ మొదలు కాదంటున్నారు. కాగా.. జూన్ నెలలోనే పాఠశాలలు ప్రారంభం కానుండడంతో అప్పుడు ఈ బదిలీల ప్రక్రియ చేపడితే అనేక ఆటంకాలు ఎదురవుతాయంటున్నారు. అలాగే.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భాషా పండితుల పదోన్నతులు కూడా చేపట్టకపోవడంతో వారంతా ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళబాట పట్టే అవకాశం ఉందంటున్నారు.

ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు..

తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఉద్యోగుల సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఉద్యోగ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో పెండింగ్ డీఏపై ప్రకటన చేయకపోవడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికీ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నా, వాటిపై స్పందించడం లేదు. అలాగే భాషా పండితుల పదోన్నతులకు హామీ ఇవ్వలేదు. ఎస్జీటీల బదిలీలు, పదోన్నతులు నిలిచిపోయాయి. పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయడం లేదు. ఒకటి, రెండు సమస్యలపై పరిష్కారం లభిస్తుందని భావించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. **- ఎస్.భూమన్న యాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్.**

డిమాండ్ల సాధన కోసం పోరాటం..

ఆత్మీయ సమ్మేళనం పేరిట ఉద్యోగ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశం కేవలం నవ్వులాటకే పరిమితమైంది. ఉద్యోగులకు భరోసా కల్పించే ఒక్క ప్రకటన కూడా చేయలేదు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఉద్యోగులకు 5 డీఏలను ఇవ్వకపోతే ప్రభుత్వాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి 4 డీఏలను పెండింగ్‌లో పెట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితితో ఏ ప్రభుత్వాలు కూడా వారి సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే మనుగడ సాగించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. లేకుంటే పార్లమెంటు ఎన్నికల తర్వాత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటానికి దిగుతాం.

- లింగన్న, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, నిర్మల్.

ఖాళీగా దర్శనమిస్తున్న కూర్చీలు

అధికారులెక్కడ?

సమయపాలన పాటించని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

బుధవారం ఉదయం 11.15 గంటలు అవుతున్నది. బజార్‌హత్నూర్ ఎంపీడీవో కార్యాలయానికి 'నమస్తే' వెళ్లగా.. అధికారులు ఎవరు రాలేదు. కానీ.. ప్రజాపాలన దరఖాస్తులు ఇవ్వడానికి మోరుకండి, దిగ్నూర్, దేగాం గ్రామాల నుంచి ఐదుగురు వచ్చారు. ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ కాచన మాల, టైపిస్టు నూతన ప్రసాద్ రాలేదు. సూపరింటెండెంట్ ఎన్నికల డ్యూటీలో ఉండగా.. జూనియర్ అసిస్టెంట్ సెలవులో ఉన్నాడు. కాంచనమాల, నూతన ప్రసాద్ 11.30 గంటల వరకు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా వారికి ఫోన్ చేసి.. వస్తున్నామని తెలిపారని చెప్పాడు. **- బజార్‌హత్నూర్, మార్చి 20**

ఇంటి గేట్లు లాక్కెళ్తున్నారు..

మొండి బకాయిదారులపై బల్దియా అధికారుల కొరడా

- నిర్మల్ మున్సిపాలిటీలో 500 మందికి రెడ్ నోటీసులు
- 10 రోజులే గడువు.. బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ..
- గడువు లోగా చెల్లించండి : ఆర్ఐ అనూఫ్ కుమార్

ఇంటి గేటును ట్రాక్టర్‌లో ఎక్కిస్తూ..

నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్ కాలనీకి చెందిన ఓ ఇంటి యాజమాని ఆస్తిపన్ను చెల్లించడంలో జాప్యం చేస్తున్నాడు. దీంతో రెవెన్యూ అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా చెల్లించాలని సూచించారు. గడువు ముగిసినప్పటికీ స్పందించక పోవడంతో మున్సిపల్ చట్టం ప్రకారం ఆస్తులను జప్తు చేశారు. ఇంటి గేటును తొలిగించి మున్సిపాలిటీకి తరలించారు.

నిర్మల్ పట్టణంలోని గాజులపేట్‌కాలనీకి చెందిన ఓ ఇంటి యజమాని వద్దకు ఆస్తి పన్ను చెల్లించాలని అధికారులు వచ్చారు. చెల్లించాలని కోరినా వినక పోవడంతో రెవెన్యూ అధికారులు రెడ్ నోటీసులు జారీ చేసి మూడు రోజుల్లోగా పన్నును చెల్లించాలని సూచించారు. స్పందించకపోవడంతో ఇంటి గేటును తీసుకెళ్లారు.

నిర్మల్ అర్బన్, మార్చి 20 : 'పన్నులు చెల్లించండి.. పట్టణాభివృద్ధికి సహకరించండి..' అంటూ మున్సిపాలిటీ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మార్చి 31వ తేదీలోపు 100 శాతం పన్నులను వసూలు చేయాలని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్స్, రెవెన్యూ అధికారులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. దీంతో అధికారులు పన్నుల వసూళ్లను వేగవంతం చేశారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్‌ను, ఇంటింటికీ బిల్ కలెక్టర్‌ను పంపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా బిల్లులను చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఎనిమిది బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో బిల్ కలెక్టర్, సహాయకుడు ఉండగా.. వీరిని రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా.. పన్నులు వసూలు కాకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

కొరడా ఝుళిపిస్తున్న అధికారులు

ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. పన్నులు చెల్లించకుండా జాప్యం చేస్తున్న 500 మంది ఇంటి యజమానులకు అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో మూడు రోజుల్లో చెల్లించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారి ఆస్తులను జప్తు చేస్తున్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్, గాజులపేట్ కాలనీలోని ఆరు ఇండ్ల యజమానులు దాదాపు రూ.4 లక్షల ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉండడంతో వారి ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నలుగురు తమ బకాయిలను చెల్లించారు.

వడ్డీ మాఫీ వెసులుబాటు

మొండిబకాయిలను సలువుగా వసూలు చేసేందుకు వడ్డీ మాఫీ వెసులుబాటు కల్పించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిదారులు పన్నులను చెల్లించక పోవడంతో వాటికి వడ్డీ కలిపి పన్నులను వసూలు చేస్తున్నారు. పెండింగ్ పన్నులపై విధించిన వడ్డీని 90 శాతం మాఫీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మొండి బకాయిదారులకు ఊరట లభించింది. కాగా.. మార్చి 31లోగా పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని నిర్మల్ మున్సిపల్ రెవెన్యూ అధికారి అనూఫ్ కుమార్ తెలిపారు.

మున్సిపాలిటీ	నిర్మల్
గృహాలు	23,089
వసూలు కావాల్సిన డబ్బులు	రూ.10.93 కోట్లు
వసూలైనవి	రూ.4.59 కోట్లు
వసూలు కావాల్సినవి	రూ.6.34 కోట్లు

రూ.50 వేలు దాటితే రశీదు తప్పనిసరి

- రూ.10 లక్షలు దాటితే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుంది..
- అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి..
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేల నుంచి రూ.10 లక్షల మధ్య నగదు లావాదేవీలు జరిగితే రశీదు ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి ఇంటెలిజెన్స్, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రూ.10 లక్షల పైన లావాదేవీలు ఉంటే ఆదాయపన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. ఏటీఎంలలో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈవో నుంచి అనుమతి పొందాలన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి, క్యాష్ జనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలని, వెహికిల్ నంబర్స్‌ను తనిఖీ చేయాలని వివరించారు. రోజు క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సీజ్ చేసిన వాటిని ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్) పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రం లోపల, వెలుపల సీసీ కెమెరాలు వంద శాతం ఏర్పాటు చేయాలని సూచించారు. యువతతో సమావేశాలు నిర్వహించి సి-విజిల్‌పై అవగాహన కల్పించాలన్నారు. 85 ఏండ్లు దాటిన వారు, దివ్యాంగులకు హోం ఓటింగ్ నిమిత్తం ఫారం-12(డి)ని ఇంటింటికీ అందజేయాలన్నారు. అనంతరం ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం రవాణాను నియంత్రించాలన్నారు. ప్రతి చెక్‌పోస్టులో వీడియోగ్రఫీ ఉండాలని, 24 గంటలపాటు నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ పాల్గొన్నారు.

నగదు పట్టివేత

భైంసా, మార్చి 20 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని భోకర్ చౌరస్తా వద్ద బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ముథోల్ గ్రామానికి చెందిన ప్రేం లక్ష్మణ్ ముథోల్ నుంచి భైంసా వస్తుండగా అతని దగ్గర అనధికారికంగా ఉన్న రూ.1. 20లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ గౌసొద్దీన్ తెలిపారు.

తాగునీరు, కరెంటు ఇస్తాం..

- నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్
- డబుల్ బెడ్రూం ఇండ్ల పరిసరాల పరిశీలన
- 'నమస్తే' కథనానికి స్పందన

డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద ప్రజలతో మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ఖానాపూర్, మార్చి 20 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ శివారులోని కుమ్రంభీం చౌరస్తాలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లలోని తాగునీరు, కరెంటు సమస్యలపై ఈ నెల 10న 'నమస్తే తెలంగాణ' లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ డబుల్ బెడ్రూం ఇండ్ల పరిసరాలను పరిశీలించారు. కాలనీ వాసులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏ,సీ బ్లాక్‌లలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లకు మరమ్మతు చేయించి తమకు తాగు నీరు అందించాలని ప్రజలు వేడుకున్నారు. దీంతో స్పందించిన ఆయన ప్రత్యామ్నాయంగా ట్యాంకర్‌తో ఉదయం సాయంత్రం మంచి నీటిని అందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎక్బాల్‌పూర్ గ్రామం నుంచి డబుల్ బెడ్రూం ఇండ్ల వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను రెండు రోజుల్లో పూర్తి చేసి నీటి సరఫరా చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, వైస్ చైర్మన్ సంతోష్, కమిషనర్ మనోహర్, మున్సిపల్ డీఈ జాదవ్ సంతోశ్, డీడబ్ల్యూ మల్లారెడ్డి ఉన్నారు.

'నమస్తే'లో ప్రచురించిన కథనం

పెండింగ్ కేసులను పరిష్కరించాలి..

- పార్లమెంట్ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి..
- సమీక్షా సమావేశంలో ఎస్పీ జానకి షర్మిల

మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, మార్చి 20 : నిర్మల్ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. చెక్‌పోస్టులలో నిత్యం తనిఖీలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించే వారిని బైండోవర్ చేయాలన్నారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ 'ఆఫ్'

- ప్రజాపాలన సేవా కేంద్రంలో ఏడు గంటల నిరీక్షణ
- అర్జీలు ఇవ్వకుండానే వెనుదిరిగిన దరఖాస్తుదారులు

నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజల పడిగాపులు

నిర్మల్ మున్సిపాలిటీలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ కనెక్షన్, ఇందిరమ్మ ఇండ్ల కోసం మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకోసం బల్దియాలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. నిర్మల్ పట్టణంలో 42 వార్డులు ఉండగా.. వివిధ కాలనీల నుంచి బుధవారం దాదాపు 100 మంది అర్జీలు ఇవ్వడానికి తరలివచ్చారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దాదాపు ఏడు గంటలపాటు సర్వర్ పని చేయలేదు. దీంతో ప్రజలు అర్జీలు ఇవ్వడానికి నిరీక్షించారు. ఆన్‌లైన్ పనిచేయక పోవడంతో వెనుదిరిగారు.

- నిర్మల్ అర్బన్, మార్చి 20